క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగించడంతో శుభ్రంగా ఉన్న రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో భక్తుల రాకపోకలు ఇబ్బందికరంగా ఉందని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. రాజానగర్ నుంచి నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో పిచ్చిమొక్కలు పెద్దగా పెరిగిపోవడం వల్ల రహదారి కనిపించకుండా పూడుకుపోయిందని గుర్తించి పిచ్చిమొక్కలను తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ఆలయానికి రాకపోకలు సుగమం అయ్యాయని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేయించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిబంధనల ప్రకారం పనులు చేయించాలని ఎంపీడీఓ రంగనాయకులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం నూతనంగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పనికోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. పనులకు హాజరైన వారికి మాత్రమే హాజరు వేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ డాక్టర్ భాస్కర్‌రావు, ఏపీఓ గురువర కుమార్, టీఏలు పాల్గొన్నారు.

పిడుగుపడి గేదె మృతి



గేదె కళేబరం వద్ద పశుపోషకులు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగు పడటంతో గ్రామానికి చెందిన దుగ్గెంపూడి సుబ్బారెడ్డికి చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గెదె విలువ 80 వేల రూపాయల చేస్తుందని రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చనిపోయిన గెదెను చూసి చలించిపోయారు.



నాగులవరం-నికరంపల్లి రోడ్డు



కంకర రాళ్లు లేచి అధ్వానంగా మారిన అక్కపల్లె రోడ్డు



కొండేపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రోడ్లు ఛిద్రం..రిపేర్లు శూన్యం!

మార్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే నెల రోజుల్లోనే రోడ్లన్నీ రిపేర్లు చేస్తామని హామీలు గుప్పించి అధికారంలోనికి వచ్చి నాలుగు నెలలైనా ఒక్క గుంతకు బొచ్చెడు మట్టికూడా పోయలేదు. దీంతో గుంతలు పడిన రోడ్లపై నడవడానికి ప్రజలు అపసోపాలు పడుతున్నారు. మార్కాపురం ప్రాంతంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంతో పాటు గ్రామాల్లో రోడ్లు ఛిద్రమైపోయాయి. ఆర్‌అండ్‌బీ, రవాణా, మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల గుంతలు ఎక్కువగా ఉండటంతో గమనించక వాహనాలు నడుపుతూ క్షతగాత్రులవుతున్నారు. మార్కాపురం నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు, మార్కాపురం-కొండేపల్లి రోడ్డు, నాగులవరం-నికరంపల్లి, రాయవరం ఎస్సీ కాలనీ రోడ్డు, మార్కాపురం-చెరువుకట్ట రోడ్డు (అలుగు వద్ద) అడుగుకో గుంత పడి ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు ఈ రోడ్లపై ప్రయాణించేప్పుడు నరకం చూస్తున్నారు. ప్రధానమైన రహదారులు కావడంతో రోడ్లన్నీ ఛిద్రమైపోవడంతో వీటిపై ప్రయాణం నరకానికి నకలుగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం సాగేదెలా..

రాచర్ల: మండలంలోని అక్కపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర రాళ్లతో అధ్వానంగా తయారైంది. అక్కపల్లె నుంచి అనుములపల్లె వెళ్లే రోడ్డుకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు వేసేందుకు పాత రోడ్డును తొలగించి కంకర వేసి వదిలేశారు. దీంతో అక్కపల్లె గ్రామస్తులు ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు.



రాయవరం ఎస్సీ కాలనీలో బురదతో నిండిన రహదారి

అంతేకాక తుడిమెళ్ల నుంచి అక్కపల్లె గ్రామం మీదుగా నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వెళ్లాలంటే ఈరోడ్డుపై ప్రయాణం చేయాల్సి ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో తుడిమెళ్ల మీదుగా అక్కపల్లె, చోళ్లవీడు, చినగానిపల్లె, జేపీ చెరువు గ్రామాల మీదుగా భక్తులు ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని అక్కపల్లె రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపై నీటి ప్రవాహం

రాచర్ల: మండల పరిధి చోళ్లవీడు టూటౌన్‌లోని రోడ్డుపై వర్షపు నీరు పారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ వాగు పొంగడంతో చినగానిపల్లె గ్రామంలోని రంగయ్యనాయుడు చెరువు నిండి అలుగు పారుతోంది. ఆ నీరంతా పంటపొలాల నుంచి వచ్చి చినగానిపల్లె మీదుగా చోళ్లవీడు టూటౌన్‌లోని రోడ్డుపై నీరు పారుతుండటంతో స్థానికులతో పాటు, చినగానిపల్లె గ్రామస్తులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చోళ్లవీడులో టూటౌన్‌లో సైడుకాలువలు పూడికతో నిండిపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపై పారుతుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సైడుకాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి రోడ్లపై ప్రవహించే వర్షపు నీటిని సైడు కాలువల్లో ప్రవహించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



చోళ్లవీడులో రోడ్డు ప్రవహిస్తున్న వర్షపు నీరు

గుంతలు పూడ్చిన పోలీసులు



గుంతలు పూడ్పిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం, కంభం సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను సీఐ సుబ్బారావు సిబ్బందితో పూడ్పించారు. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో ఆయనే తన సిబ్బందితో వెళ్లి ప్రధాన రహదారులైన పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి సోమవారం గుంతలకు మట్టి పోసి పూడ్చటంతో ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై, పీఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సు హామీ అమలు ఎప్పుడు?

మార్కాపురం: సీఎం చంద్రబాబునాయుడు తాము అధికారంలోనికి వచ్చిన వెంటనే సూపర్ 6లో భాగమైన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తానని చెప్పి నాలుగు నెలలైనా చేయలేదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ విమర్శించారు. సోమవారం ఆయన ఉచిత బస్సు పథకం అమలు చేయనందుకు నిరసనగా పార్టీ నాయకులతో కలిసి మార్కాపురం నుంచి దోర్నాలకు బస్సులో ప్రయాణికులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో ప్రయాణించే మహిళలకు ఉచిత సర్వీసులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పార్టీ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, షేక్ ఇస్మాయిల్, వెంకటరెడ్డి, షమీ అహమ్మద్, రిజ్వాన్, హమీద్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మిర్చిపంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి రమేష్

తర్లుపాడు: మండలంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటల్లో రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్కాపురం ఉద్యానశాఖాధికారి రమేష్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తాడివారిపల్లి, నాగేళ్లముడిపి, చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన బొప్పాయి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు ఉరకెత్తిన పొలాల్లో లీటరు నీటికి పది గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు రోజులు పిచికారీ చేయాలని, మొక్కలు తలలు వాల్చితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఇనుపధాతు లోపంతో మొక్కలు వాలినట్లు కనపడితే లీటరు నీటికి 50 గ్రాముల అన్నబేధి, ఒక్క నిమ్మచెక్క రసం కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుకుళ్లు ఆశించిన పొలాల్లో కాప్రాక్స్ క్లోరైడ్ 30 గ్రాములు, కార్బన్డిజం పది గ్రాములు పదిలీటర్ల నీటిలో కలిపి ద్రావణన్ని మొక్కల మొదట్లో పోయాలన్నారు. గొంగళిపురుగుల నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ లేదా అసల్ఫేట్ 1.25 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. కొత్తగా బొప్పాయి మొక్కలు నాటేప్పుడు నీరు నిల్వకుండా చూసుకోవాలని తెలిపారు. ఒకవేళ మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు ఉంటే రెడోనిల్ 2 గ్రాములు, ఎలైట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని పోయాలన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రఫీ మాట్లాడుతూ గత వారం రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తూ తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. 25 ఏళ్ల నుంచి కార్మికులు పనిచేస్తున్నారని వారిని అర్ధాంతరంగా తొలగించడంతో వారి కుటుంబాలన్నీ వీధిన పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, అధికారపార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి కార్మికులను అక్రమంగా తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

రెజ్లింగ్ పోటీల్లో గొట్లగట్టు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొన్న మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల పీడీ బాలగురవయ్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వి.విష్ణువర్ధన్‌రెడ్డి, వరప్రసాద్, ఉమాశంకర్, దుర్గాప్రసాద్, వెంకటయ్య, నవీన్, యువరాజు, పి.విష్ణువర్ధన్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. వారిలో విష్ణువర్ధన్‌రెడ్డి బంగారు పతకం సాధించగా వరప్రసాద్ బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు. విష్ణువర్ధన్‌రెడ్డి వచ్చే నెల 16వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్పష్టం చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక కావటానికి మంచి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీ బాలగురవయ్యను, ఎంపికై న క్రీడాకారులను హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

- 29 మందిపై కేసు నమోదు



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హైమావతి తెలిపారు. నాలుగు గ్రూపులుగా విద్యుత్ అధికారులతో పాటు 72 మంది సిబ్బంది మండలంలో అన్నీ గ్రామాల్లో పర్యటించి అక్రమంగా విద్యుత్ వాడే వారిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.69 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పాలగిరి శ్రీనివాసులు, హరిబాబు, స్థానిక ఏఈ ఎస్.వీరబ్రహ్మం, ఇంజినీర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

గిద్దలూరు రూరల్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరు త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, రాచర్ల గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ప్రజలకు నిరంతరం సేవలను అందించే పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ సమాజ హితానికి పాటుపడే పోలీసుల సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, రాచర్ల, కొమరోలు ఎస్సైలు కోటేశ్వరరావు, నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ కె.సురేష్



కంభంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల, పక్కన సీఐ సుబ్బారావు

భారీ ర్యాలీ నిర్వహించిన పోలీసులు

కంభం: స్థానిక పట్టణంలో పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఐ మల్లిఖార్జున ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీసుల త్యాగ ఫలాలను గుర్తు చేసుకుంటూ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు, ఎన్‌సీసీ విద్యార్థులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువం

మార్కాపురం: విధి నిర్వహణలో ప్రజల రక్షణలో పోలీసులు చేసిన త్యాగాలు మరువమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పట్టణ సీఐ సుబ్బారావు అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంగణం నుంచి పురవీధుల వరకూ జరిగిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజా రక్షణలో పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి త్యాగాలు వెలకట్టలేమన్నారు. ఆపద సమయాల్లో, ప్రమాద సమయాల్లో శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 నుంచి 31 వరకూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, పీఎస్ఐ రాజమోహన్‌రావు, ఏఎస్సైలు మునాఫ్, వెంకటేశ్వర్లు, రైటర్ సురేష్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

కొనకనమిట్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఏపీడీ జేకే నిర్మలాదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో గ్రామ సభల్లో తెయజేసిన పనులను గుర్తించి ఆ మేరకు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, రిసోర్స్ పర్సన్ అనిల్‌కుమార్, ఏపీఓ బుల్లెన్నరావ్, క్లస్టర్ సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నవోదయలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం శ్రీజవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు అక్టోబరు 30 చివరి తేదీ అని, విద్యార్థులు నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు httpr://navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 22 నుంచి 25 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నారాయణరావు సోమవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 23 వరకూ పూలసుబ్బయ్య కాలనీలోని ఎంపీయూపీ స్కూల్లో, 24 నుంచి 25 వరకూ బాపూజీ కాలనీలోని మున్సిపల్ సెంట్రల్ స్కూల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంటు, బయోమెట్రిక్ అప్‌డేషన్, డెమోగ్రఫీక్ అప్డేట్లను ఉచితంగా నిర్వహిస్తారని, బయోమెట్రిక్ అప్‌డేట్ 100 రూపాయలు, డెమోగ్రాఫిక్ అప్డేట్లకు 50 రూపాయలు, డౌన్‌లోడ్ అండ్ కలర్ ప్రింట్ 30 రూపాయలకు అందిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



యాక్సిడెంట్ జోన్‌లను పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని సీఐ సుబ్బారావు తెలిపారు. మండలంలోని కోమటికుంట వద్ద తరుచూ జరుగుతున్న యాక్సిడెంట్స్ జోన్‌లను ఆయన సోమవారం సాయంత్రం రూరల్ ఎస్సై అంకమరావుతో కలిసి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మూలమలుపుల వద్ద నిదానంగా వెళ్లాలని వాహనదారులకు సూచించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

మార్కాపురం రూరల్: మార్కాపురం యూనిట్ ఏపీ జూనియర్స్ ఫారెస్టు ఆఫీసర్సు అసోసియేషన్ అధ్యక్షునిగా ఎస్‌కే కరీముల్లా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మార్కాపురం డివిజన్‌లోని 70 మంది సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా శశిభూషణ్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.సుధాకర్, జాయింట్ సెక్రటరీగా టి.బాలాకుమారి, కోశాధికారిగా ఎస్‌కే అబ్దుల్ జబ్బార్‌లు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.



నూతన కమిటీ ప్రతినిధులు

విద్యార్థిని దస్తగిరమ్మకు నివాళులు

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ జిల్లాలో ఇంటర్మీడియెట్ చదువుతున్న దస్తగిరమ్మను ఓ యువకుడు కిరాతకంగా హత్యచేశారు. మృతురాలికి 'మేమున్నాం సేవా సమితి' ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.రంగస్వామిరెడ్డి మాట్లాడుతూ దస్తగిరమ్మను ప్రేమ పేరుతో నమ్మించి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి హత్యచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటివి సమాజంలో ఎక్కడా జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి, నిర్వాహకుల శ్రీకాంత్, లొక్కు శరత్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే

రజక విద్యాసేవ లక్ష్యం

- ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు శంకర్

మార్కాపురం: పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా రజక విద్యాసేవ సంక్షేమ సంఘం ముందుకు వెళ్తోందని ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు దేవలూటి శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మార్కాపురంలో మీడియాతో మాట్లాడుతూ రజక వృత్తిదారుల కుటుంబాలకు చెందిన పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించి వారు అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మెరిట్ ఆధారంగా మంచి మార్కులు సాధిస్తున్న రజక పేద విద్యార్థులకు, తల్లిదండ్రి లేని విద్యార్థులకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు. రెండు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని చెప్పారు. పేదరికం కారణంగా ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అటువంటి విద్యార్థులకు తమ సంస్థ సహకరిస్తుందని, పూర్తి సమాచారం కోసం 80966 46072 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.